# సింగరేణికి రక్షణగా సీఎం కేసీఆర్



శ్రీరాంపూర్ వర్క్‌షాప్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే దివాకర్‌రావు

- సింగరేణిలో కొత్త ఉద్యోగాలు, హక్కులు కల్పించిన ఘన కేసీఆర్‌దే
- కోలిండియాలో లేని హక్కులున్నాయి
- బీఆర్ఎస్‌కు మద్దతుగా కారుకే ఓటేయాలి
- మంచిర్యాల అభ్యర్థి, ఎమ్మెల్యే దివాకర్‌రావు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావ్

శ్రీరాంపూర్, నవంబర్ 24 : తెలంగాణ ఉద్యమంలో 40 రోజుల పాటు  సకలజనుల సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొని తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నారని, అందుకే కార్మికులపై కేసీఆర్‌కు మక్కువ అని, సింగరేణి గనులు ప్రైవేటీకరణ కాకుండా కాపాడుతున్న కేసీఆర్‌కు మద్దతుగా కారు గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే దివాకర్‌రావు, టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావ్ కోరారు. శుక్రవారం శ్రీరాంపూర్ ఏరియా వర్క్‌షాప్, స్టోర్, టింబర్ యార్డులను సందర్శించి కార్మికులను కలిశారు. ఈ సందర్భంగా ఏరియా ఉపాధ్యక్షుడు సురేందర్‌రెడ్డి ఆద్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. కార్మికులకు కారుణ్య ఉద్యోగాలు అమలు చేయడం వల్ల నేడు సింగరేణిలో 16 వేల మంది యువకులకు ఉద్యోగాలు దొరికాయన్నారు. నోటిఫికేషన్ల ద్వారా కూడా 4 వేల ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. కేసీఆర్ ఉన్నంత వరకు సింగరేణిని ప్రైవేట్ పరం కాకుండా అడ్డుకుంటారన్నారు. సింగరేణికి కేసీఆర్ రక్షణగా ఉంటారని తెలిపారు. కార్మికులకు 15 శాతం నుంచి 32 శాతానికి సంస్థ లాభాల్లో బోనస్ ఇస్తున్నారని తెలిపారు. కార్మికుల పోరాటం వల్ల ఢిల్లీలో పీఠాలు కదిలి రాష్ట్ర సాధనకు బాటలు పడ్డాయన్నారు. అందుకే కేసీఆర్‌కు కార్మికులపై ప్రేమ ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉండడం వల్లే కార్మికులకు అన్ని విధాలా ఆర్థిక ప్రయోజనాలు కలుగుతున్నాయని చెప్పారు. కార్మికులు కారు గుర్తుకు ఓటు వేసి కేసీఆర్‌ను హ్యాట్రిక్ సీఎంగా నిలబెట్టాలని కోరారు. కార్మికులకు ఉచిత విద్యుత్ ఇస్తున్నారని చెప్పారు. జాతీయ కార్మిక సంఘాలు వారసత్వ ఉద్యోగాలు పోగొడితే, కేసీఆర్ కారుణ్యంతో కాంతులు నింపారు. ఎమ్మెల్సీ కవిత ద్వారా కార్మికులకు ఆనేక హక్కులు సాధించి పెట్టామన్నారు. కోలిండియాలో లేని హక్కులు కార్మికులకు ఉన్నాయని చెప్పారు. కాంగ్రెస్, బీజేపీ కార్మిక సంఘాలు కార్మికుల డిపెండెంట్ ఉద్యోగాలు పోగొట్టాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్ర ఉపాధ్యక్షుడు అన్నయ్య, మల్లారెడ్డి, కేంద్ర చర్చల ప్రతినిధి ఏనుగు రవీందర్‌రెడ్డి, ఏరియా చర్చల ప్రతినిధులు వెంగళ కుమారస్వామి, కాశీరావు, పెట్టం లక్ష్మణ్, బ్రాంచ్ కార్యదర్శి పానుగంటి సత్తయ్య, కానగంటి చంద్రయ్య, గడ్డం మహిపాల్‌రెడ్డి, అడ్డు శ్రీనివాస్, పిట్ కార్యదర్శి వెంకటేశ్వర్లు, కరుసు దుర్గయ్య, మహేందర్‌రెడ్డి, నీలం సదయ్య, పొగాకు రమేశ్, అన్వేష్‌రెడ్డి, ఏరియా ఆర్గనైజింగ్ కార్యదర్శులు తొంగల రమేశ్, ఒల్లాల రవి, మహేశ్‌రాజు, మోహన్ పాల్గొన్నారు.



స్టోర్, వర్క్‌షాప్ వద్ద మాట్లాడుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావ్

## కార్మికులను సొంత బిడ్డల్లా చూసుకున్నారు..

- మళ్లీ కేసీఆర్‌నే సీఎంగా చేయాలి
- ప్రజా ఆశీర్వాద సభలో మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవిందరెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవిందరెడ్డి

మంచిర్యాలటౌన్, నవంబర్ 24 : సింగరేణి కార్మికులను సొంత కొడుకుల్లా భావించి. వారికి హక్కులు కల్పించి ఆర్థికంగా ఆదుకున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని, ఆయనను మూడోసారి సీఎం చేయాలని మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవిందరెడ్డి పిలుపునిచ్చారు.  మంచిర్యాలలో ప్రజా ఆశీర్వాద సభలో మాజీ ఎమ్మెల్యే గడ్డం అరవిందరెడ్డి పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణను తెచ్చుకున్నామని,  2014లో ఓటు వేసి ప్రజలంతా  కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేశారని, ఈసారి కూడా కేసీఆర్‌ను గెలిపించి ఆయనను మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలని  కోరారు. కార్మికులకు హక్కులు కల్పించి,  లాభాల వాటా బోనస్ 15రోజుల ముందే అందజేశారని అన్నారు. ప్రపంచంలో లాభాలా వాటా పంచడం అనేది ఎక్కడా లేదని,  కేవలం సింగరేణిలోనే ఉన్నదని  గుర్తు చేశారు. 16 శాతం నుంచి 32 శాతానికి పెంచిన ఘనత సీఎం కేసీఆర్‌దేనన్నారు. దీంతో ఒక్కో కార్మికుడికి రూ. లక్షన్నర నుంచి రెండు లక్షల పైబడి సొమ్ము జేబులోకి వచ్చిందన్నారు. కొత్తగా ఏర్పాటుచేసిన నస్పూర్ మున్సిపాలిటీ అభివృద్ధి చెందుతున్నదని అన్నారు. గ్రామాల్లో అన్ని రోడ్లు, పార్కులు, మౌలిక వసతులు కల్పించినట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా అమలు చేయని సంక్షేమ పథకాలు అమలుచేశారనీ, మరిన్ని పథకాలు అమలు కావాలంటే సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమని, మూడోసారి ముఖ్యమంత్రిగా చేయాలని పిలుపునిచ్చారు.

### సింగరేణిలో తండ్రీకొడుకుల ఉద్యోగాల ఘనత కేసీఆర్‌దే
**- టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ వెంకట్రావ్**

సింగరేణి సంస్థలో తండ్రీకొడుకుల ఉద్యోగాలను పునరుద్ధరించిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ వెంకట్రావ్ అన్నారు. తెలంగాణ ప్రాంతాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని, పేదలకు, నిరుపేదలకు రెండుపూటలా అన్నం తినేలా సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, ఈ సారి వచ్చే ఎన్నికల్లో భారీ మెజార్టీతో బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. మూడోసారి అధికారంలోకి వచ్చాక అనేక అభివృద్ధి, సంక్షేమ పథకాలు జరుగుతాయని చెప్పారు. ఇతర పార్టీలు ఓట్లు వేయించుకోవడానికి కుట్రలు చేస్తున్నాయని, వారి మాటలు నమ్మవద్దని అన్నారు. సీఎం చేసిన వాగ్ధానాలన్నింటినీ అమలు చేశారని,  ముఖ్యంగా సింగరేణి కార్మికులకు అనేక ముఖ్యమైన డిమాండ్‌లు ఇప్పించిన ఘనత కేసీఆర్‌దేనని అన్నారు. 134 సంవత్సరాల సింగరేణి చరిత్ర కలిగిన సింగరేణిలో 1981 జనవరి 21న తండ్రీ కొడుకుల ఉద్యోగాలు మొదలయ్యాయని,  పనిచేయలేని వారు వారి కొడుకులకు ఉద్యోగాలు ఇచ్చేవారని అన్నారు. ఈ పద్ధతి 1998 వరకు కొనసాగిందని, ఒక జాతీయ కార్మిక సంఘం తప్పుడు ఒప్పందంతో అవి పోయాయని,  తిరిగి ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి వల్ల 2018 సంవత్సరం మార్చి 9నుంచి తండ్రీ కొడుకుల ఉద్యోగాలు వచ్చాయన్నారు. ఇప్పటివరకు 105 మెడికల్ బోర్డులు జరిగాయని, 11వేల 600 మంది ఉద్యోగాలు చేస్తున్నారని,  7వేల మందిని నేరుగా నియామకం ద్వారా ఉద్యోగాలు కల్పించినట్లు తెలిపారు. భవిష్యత్‌లో కూడా ఈ ఉద్యోగాలు కొనసాగాలని, అందరూ మంచిగా బతకాలంటే కేసీఆర్ ఉండాలని అన్నారు.



మాట్లాడుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు బీ వెంకట్రావ్





ప్రజా ఆశీర్వాద సభ వేదికపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు, మహిళా నాయకురాళ్లు

### కొడుక్కు ఉద్యోగం ఇచ్చిండు..మళ్లా కేసీఆరే రావాలే..



నాకొడుకుకు కేసీఆర్ దయవల్లే ఉద్యోగం వచ్చింది. కేసీఆర్ లేకుంటే సింగరేణిలో ఉద్యోగాలు దొరికేవి కాదు, మళ్లా కేసీఆర్ సర్కారే రావాలి, కేసీఆరే ముఖ్యమంత్రి కావాలి. సింగరేణి యువతకు తండ్రి లాంటి వాడు. తెలంగాణా కోసం పోరాడిన యువతకు సింగరేణిలో ఉద్యోగాలు పెట్టించిండు. కారుణ్యంతో సింగరేణిలో మళ్లీ కాంతులు, విద్యుత్ వెలుగుల్లా సింగరేణి కళ కళలాడుతుంది.

**-భీమారి కొమురయ్య, రిటైర్డ్ కార్మికుడు శ్రీరాంపూర్**

### ఎమ్మెల్యే దివాకర్‌రావు మంచి మనిషి..



ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు అవినీతి పరుడు కాదు, ఒకరిని దోచుకోవాలనే వారు కాదు, ఎవరికీ అన్యాయం చేయరు. తన సాధ్యమైనంత వరకు అభివృద్ధి చేస్తున్నారు. కేసీఆర్ ద్వారా అందరి అభివృద్ధికి కృషి చేస్తారనే నమ్మకం ఉంది. తాను కేసీఆర్ సర్కార్ రావడానికి కారుగుర్తుకు ఓటు వేస్తాను. దివాకర్‌రావును ఎమ్మెల్యేగా గెలిపిస్తా. ఇతర పార్టీల వారు ప్రజలకు అందుబాటులో ఉండరు. ఉన్నా వారికి కలిసే అవకాశం, పరిస్థితులు ఉండవు. శ్రీరాంపూర్ ఏరియా సింగరేణి స్థలాల్లో తాము నివాసం ఉంటున్నాము. మాకు ఇళ్ల స్థలానికి పట్టా కల్పించారు.

**-మూల శేఖర్ రిటైర్డ్ కార్మికుడు, శ్రీరాంపూర్**

### వరద సమయంలో ఆదుకున్నారు..



మాది నస్పూర్ గ్రామం. వరద బాధితుడిగా ఉన్నప్పుడు దివాకర్‌రావు మా గ్రామాన్ని సందర్శించి సహాయం చేశారు. ఆయన సహాయం మరిచపోలేం. ఓటుతో కృతజ్ఞత చాటుకుంటాం. కేసీఆర్ సర్కార్ కోసం దివాకర్‌రావు కారు గుర్తుకు ఓటు వేస్తాం. కేసీఆర్ రైతులకు అన్ని విధాలా సహాయం చేస్తున్నారు. పంట సాయం అందిస్తున్నారు. గతంలో ఏ ప్రభుత్వం రైతులను చూసింది. లేదు. వ్యవసాయ భూమి పన్ను కూడా ఎత్తి వేశారు. ధరణి తీసుకు వచ్చాడు, దర్జాగా తాము వ్యవసాయం చేసుకుంటున్నాము.

**-అక్కల రాయుడు, రైతు నస్పూర్ కాలనీ**

### సింగరేణి స్థలంలో  పట్టా ఇచ్చారు..



సింగరేణి స్థలంలో నివాసం ఉంటున్న మాకు ఎమ్మెల్యే దివాకర్‌రావు పట్టాలు ఇచ్చిండు. ఉమ్మడి రాష్ట్రంలో అప్పుడునోళ్లు తెలంగాణాకు అన్యాయం చేసిండ్రు. రాష్ట్రాన్ని సాధించిన సీఎం కేసీఆర్ పదేండ్ల పాలన మంచిగా ఉంది. దీన్ని చెడగొట్టుకుంటే మోసపోతాం.  అభివృద్ధి, సంక్షేమ పథకాలను పెట్టి మా ఇండ్లకు వచ్చి కల్యాణలక్ష్మి, ఆసరా, దళితబంధు, బీసీ బంధువంటి సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిండు.

**-మూల సమ్మక్క, నస్పూర్**

### ప్రజల్లో ఉండే దివాకర్‌రావునే గెలిపిస్తాం..



నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్న ఘనత దివాకర్‌రావుకే దక్కుతుంది. మాకు పించన్ పెంచుతున్నారు. మా కొడుక్కు ఎస్సీ కార్పొరేషన్ లోన్ ఇచ్చారు. నిత్యం ప్రజల మద్యలో ఉండే దివాకర్‌రావును గెలిపించుకుంటాం. కేసీఆర్ మాకు పెద్ద కొడుకులా పింఛన్లు ఇస్తూ చూసుకుంటున్నారు. కేసీఆర్ పాలనపై సంతృప్తిగా ఉంది. తిరిగి కేసీఆరే ముఖ్యమంత్రి కావాలి. తెలంగాణా రాష్ట్రంలో మూతపడిన ఆలయాలు తెరిపించి దీప దూప నైవేద్యం పథకం తీసుకచ్చారు. దాంతో ప్రజల్లో కేసీఆర్‌పై మంచి నమ్మకం ఏర్పడింది.

**-రెడపాక రాజమ్మ, నస్పూర్ కాలనీ**